

క్రీడలకు ప్రాధాన్యం

పాలమూరులో శుక్రవారం రాష్ట్రస్థాయి జూనియర్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.

-8లో ▸



జూరాలకు తగ్గిన వరద

జూరాల జలాశయానికి శుక్రవారం ఎగువ నుంచి వస్తున్న వరద స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

-8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.4 /20.7

ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం వేళ ఎండ తీవ్రత కాస్త కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

రాజ్యాంగ సవరణతో బీసీ రిజర్వేషన్లు చేపట్టాలి

నారాయణపేట రూరల్: రాజ్యాంగ సవరణతోనే బీసీ రిజర్వేషన్లు సాధ్యమవుతాయని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులుగౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై రెడ్డి జాగృతి నాయకులు కోర్టుకు వెళ్లడంపై అసహనం వ్యక్తం చేశారు. సామాజిక, రాజకీయ ప్రయోజనాలను దెబ్బతీసే కుట్ర జరుగుతుందన్నారు. మెజారిటీ ప్రజలకు వ్యతిరేకంగా న్యాయవ్యవస్థ స్టే విధించడం బాధాకరమని వాపోయారు. తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్ల విషయంలో 9వ షెడ్యూల్డ్ ప్రకారం రాజ్యాంగ సవరణ చేశారని, అదేవిధంగా తెలంగాణలో అమలు చేస్తే ఎలాంటి అడ్డంకులు ఉండవని ప్రభుత్వానికి హితవు పలికారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీలపై చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

సమాచార హక్కు చట్టంతో పారదర్శకత



నారాయణపేట రూరల్: సమాచార హక్కు చట్టంతో ప్రజలకు పారదర్శకత లభిస్తుందని ప్రిన్సిపాల్ మెర్సీ వసంత అన్నారు. స్థానిక చిట్టెం నర్సిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ విభాగాల ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం–2005పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మెర్సీ వసంత మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ సంస్థలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా సమాచార హక్కు చట్టం కృషి చేస్తుందన్నారు. ఈ చట్టం ద్వారా అవినీతి చర్యలను బయటపెట్టొచ్చని పేర్కొన్నారు. పౌరుల హక్కులను గౌరవించడం, ప్రభుత్వ కార్యాలయాలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించేలా చూడటం ఈ చట్టం ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రజాస్వామ్యం బలోపేతానికి ఈ చట్టం ఆయువుపట్టు లాంటిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రంగారెడ్డి, ప్రోగ్రాం అధికారులు షఫీక్, హైమద్, నిర్మల, సంగీత, శ్రీనివాస్, సుజాత, అలీ, శంకర్, కృష్ణ, కేశవులు, రవీందర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అబద్ధాలు, మోసాలకు కేరాఫ్ కాంగ్రెస్



నారాయణపేట రూరల్: అబద్ధాలు, మోసాలకు కేరాఫ్ కాంగ్రెస్ అని బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడు నాగురావు నామాజీ ఎద్దేవా చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బీజేపీ రాష్ట్ర నాయకుడు రతంగ్‌పాండురెడ్డి, జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్, కోశాధికారి వెంకట్రాములు, మీడియా ఇన్‌చార్జ్ కిరణ్‌దగేతో కలిసి మాట్లాడారు. ప్రజలను మోసం చేయడం, అబద్ధాలు చెప్పడం కాంగ్రెస్ పార్టీ నైజమన్నారు. ఇప్పుడు కపట ప్రేమ ఒలకబోస్తూ 42 శాతం రిజర్వేషన్ల పేరుతో బీసీలను మోసం చేసిందని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి చిత్తశుద్ధి లేదన్నారు. జీఓ 9 ను కోర్టు కొట్టేయడంతో మరోసారి మోసం బయట పడిందని పేర్కొన్నారు. నిజంగా బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని చిత్తశుద్ధి ఉంటే పకడ్బందీ చర్యలు తీసుకునేదని తెలిపారు. అసెంబ్లీ తీర్మానం చేసి గవర్నర్ కు పంపిన బిల్లుపై గడువు ముగియకుండా, గవర్నర్ నిర్ణయం కోసం ఎదురు చూడకుండా 42 శాతం బీసీ రిజర్వేషన్లను ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. కోర్టులో కాంగ్రెస్ బండారం బయటపడడంతో నెపాన్ని బీజేపీ, బీఆర్‌ఎస్‌పై నెడుతున్నారని మండిపడ్డారు. కానీ బీజేపీకి ఎవరితో కలవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కలిసి బీసీలను మోసం చేశాయని దుయ్యబట్టారు. అంతే కాకుండా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎంఐఎం పోటీ చేయకపోవడంలో రెండు పార్టీల మధ్య ఉన్న ఫెవికాల్ బంధం మరోసారి బయట పడిందని గుర్తు చేశారు. ఎంఐఎం హైడ్రా భయంతో పోటీకి దూరంగా ఉందన్నారు. బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ రానున్న ఎన్నికల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని జోస్యం చెప్పారు.

హంస ధాన్యం ధర రూ.1,739

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో శుక్రవారం జరిగిన టెండర్లలో హంస ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.1,739గా ఒకే ధర లభించింది. సీజన్ లేకపోవడం వల్ల మార్కెట్‌కు కేవలం హంస ధాన్యం మాత్రమే అమ్మకానికి వచ్చింది.

టార్పాలిన్లు అందేనా..



మద్వార్ కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉంచిన ధాన్యం (ఫైల్)

10 ఏళ్ల నుంచి రైతులకు తప్పని ఎదురుచూపులు

- సబ్సిడీ కవర్లపై స్పందించని వ్యవసాయ శాఖ
- రూ.వేలు ఖర్చు చేసి బయట కొనుగోలు చేస్తున్న వైనం
- జిల్లాలోని 1.14 లక్షల ఎకరాల్లో పంటల సాగు
- పంట కోతలు సమీపిస్తున్న తరుణంలో ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

మక్తల్: పంట కోతల తర్వాత అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడుకునేందుకు ఉపయోగించే టార్పాలిన్లను ప్రభుత్వం పదేళ్లుగా అందించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతేడాది వర్షాకాలంలో టార్పాలిన్ల కొరత కారణంగా ధాన్యం తడిసి రైతులు ఆర్థికంగా నష్టపోయారు. చిన్న, సన్న కారు రైతులకు రూ.వేలు ఖర్చు చేసి టార్పాలిన్లు కవర్లు కొనుక్కోవడం భారంగా మారింది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సబ్సిడీపై అందించే టార్పాలిన్లను మళ్లీ ప్రారంభించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ వర్షాకాలంలో జిల్లాలో 1.14లక్షల ఎకరాల్లో వరి, పత్తి, కంది, వివిధ పంటలను సాగు చేశారు. పంట కోతల సమయం ప్రారంభం కావడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఉదయం ఎండ తీవ్రంగా ఉన్నా.. సాయంత్రం అయిందంటే చాలు నల్ల మబ్బు కమ్మి కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఎండిన ధాన్యాన్ని రాశులుగా పోసిన వాటిపై కప్పేందుకు సరైన టార్పాలిన్లు అందుబాటులో లేకపోవడంతో వారి కష్టం అంతా వరద పాలవుతోంది.

రైతులకు ఆర్థిక భారం

గతంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ సమన్వయంతో రైతులకు రాయితీపై టార్పాలిన్లు పంపిణీ చేసేవారు. 250 జీఎస్‌ఎం నాణ్యత కలిగిన 8–6 మీటర్ల విస్తీర్ణం ఉన్న టార్పాలిన్ రూ.2,500 కాగా.. 50 శాతం రాయితీపై రూ.1,250 లకు అందించేవారు. కానీ 2017–2018 సంవత్సరం నుంచి ఈ పథకం అమలును ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటులో ఒక్కో టార్పాలిన్ రూ.3,500 నుంచి రూ.8వేల వరకు పలుకుతుండడంతో సన్నకారు రైతులతో పాటు దాదాపు 1.25 లక్షల మంది రైతులపై భారం పడుతోంది.

సబ్సిడీపై ఇవ్వాలి



ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతులకు సబ్సిడీపై అందించే టార్పాలిన్లను నిలిపివేయడం సరికాదు. దీంతో ఆరుకాలం కష్టపడి పండించి రైతుల ధాన్యం వర్షార్పణం అవుతోంది. ఖాళీ యూరియా సంచులతో కుట్టిన వాటిని రోజుకూ రూ.30 చొప్పున అద్దెకు తీసుకొనే ధాన్యాన్ని వర్షం నుంచి కాపాడుకుంటున్నాం. పథకం మళ్లీ ప్రారంభిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

– రాజు, గుడిగండ్ల

అధికారుల నిర్లక్ష్యం



వ్యవసాయ అధికారులు ఉన్నతాధికారులకు సరైన సమాచారం ఇవ్వకపోవడంతో టార్పాలిన్లు రైతులకు అందడం లేదు. రైతులు పడుతున్న బాధలు చూసినా అధికారులు ప్రభుత్వానికి నివేదించాలి. రూ.వేలు ఖర్చు పెట్టి టార్పాలిన్లు కొనుగోలు చేసుకుంటున్నాం. రైతులపై భారం తగ్గించాలి.

– గోవిందురాజు, దాసర్‌దొడ్డి

ప్రభుత్వం అందిస్తే..

ప్రభుత్వం నుంచి సబ్సిడీపై టార్పాలిన్లు వస్తే రైతులకు పంపిణీ చేస్తాం. 2017, 2018 నుంచి ప్రభుత్వం రాయితీని ఎత్తేసింది. రైతుల ఇబ్బందులను మరోమారు ఉన్నతాధికారులకు వివరించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

– జాన్‌సుధాకర్, డీఏఓ, నారాయణపేట

ప్రభుత్వ భూములను గుర్తించండి

- భూ భారతి పోర్టల్‌లో నిషేధిత జాబితాలోకి చేర్చాలి
- తహసీల్దార్ల సమీక్షలో కలెక్టర్ సిక్తాపట్నాయక్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్

నారాయణపేట: జిల్లాలో ప్రభుత్వ భూముల సమగ్ర వివరాలను సేకరించి, భూ భారతి పోర్టల్‌లో నమోదు చేసి వాటిని నిషేధిత జాబితాలోకి చేర్చాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనుతో కలిసి అన్ని మండలాల తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. మండలాల వారీగా అసైన్డ్ భూములు, ఎండోమెంట్, వక్ఫ్ బోర్డులు లేదా ఇతర మత సంస్థలకు కేటాయించిన భూములు, సీలింగ్, భూదాన్ భూముల వివరాలను సేకరించాలన్నారు. మండలాల వారీగా ఆయా భూముల వివరాలను తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. రెండు రోజుల్లో ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

వరి కొనుగోలు కేంద్రాల పర్యవేక్షణ తప్పనిసరి

వానాకాలం సీజన్‌లో జిల్లాలో వరి ధాన్యం దిగుబడి పెరిగే అవకాశం ఉందని, ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలపై తహసీల్దార్ల పర్యవేక్షణ ఉండాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను ఆదేశించారు. గత సీజన్‌లో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా ముందస్తుగా అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. మండల స్థాయిలో ఏఓ, ఏఈఓ, హార్వెస్టర్ల యజమానులతో తహసీల్దార్లు సమావేశం నిర్వహించి వరి కోతలు, కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా కొనసాగించేలా చూడాలన్నారు. వరి ధ్యానంతో పాటు ఈ సారి పత్తి కొనుగోళ్ల విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగడానికి వీలులేదని, కపాస్ కిసాన్ యాప్‌లో రైతులు తమ స్లాట్ బుక్ చేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఆర్డీఓ రామచందర్‌నాయక్, డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ్ ప్రణీత్, డీఏఓ జాన్ సుధాకర్, డీఎంఓ బాలామణి, పౌరసరఫరాల శాఖ అధికారులు సైదులు, బాల్‌రాజ్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఓటు చోరీతో ప్రజాస్వామ్యం ఖూనీ




సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి

నారాయణపేట: ఒకే ఇంటి నంబర్‌పై పదుల సంఖ్యలో ఓటర్లుగా నమోదు చేసుకుంటూ కొందరు ఓటు చోరీకి పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి ఆరోపించారు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీవీఆర్ భవన్‌లో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండీ సలీం ఆధ్వర్యంలో ఓటు చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకం చేసి, సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఓటు చోరీ చేయడమంటే దేశ పౌరుల హక్కులను దొంగలిస్తూ ప్రజాస్వామ్యం దగా చేయడమే అన్నారు. రాజ్యాంగాన్ని దెబ్బతీసేందుకు బీజేపీ ప్రయత్నం చేస్తుందని, మహారాష్ట్ర, కర్ణాటకలో ఓటు చోరీ జరిగిందని కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ ఆధారాలతో సహా నిరూపించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీని లక్ష్యంగా చేసుకొని కొన్ని రాష్ట్రాల్లో ఓట్లును అక్రమంగా తొలగిస్తున్నారని ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగా ఓట్ల తొలగింపును కొందరు ప్రైవేట్ వ్యక్తులు చేస్తున్నట్లు బహిర్గతం కావడం ఆందోళన కలిగిస్తుందని తెలిపారు. ప్రతి గ్రామం, వార్డుల్లో ప్రజలు సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యేలా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్లు బండి వేణుగోపాల్, సుధాకర్, సరాఫ్ నాగరాజు, మార్కెట్ వైస్ చైర్మన్ కోణంగేరి హన్మంతు, ఆర్టీఏ బోర్డు సభ్యుడు పోషల్ రాజేష్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ప్రసన్నరెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు కోట్ల మధుసూదన్‌రెడ్డి, సీనియర్ నాయకులు గందె చంద్రకాంత్, మనోహర్‌గౌడ్, హరినారాయణ భట్టడ్, కోట్ల రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

14న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి ఎన్నిక

నారాయణపేట: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పదవీ కాలం ముగియడంతో కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఆదేశాలతో ఈ నెల 14న ఉదయం 11 గంటలకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో ఎన్నికల సమావేశం నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి శంకరాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో 15 మంది కార్యవర్గ సభ్యులు, ఆఫీసు బేరర్లు అయిన చైర్మన్, వైస్ చైర్మన్, ట్రెజరర్, రాష్ట్ర కార్యవర్గ నాయకుల ఎన్నిక జరుగుతుందన్నారు. రహస్య బ్యాలెట్ ద్వారా జరిగే ఎన్నికలకు ప్రతి సభ్యుడు హాజరుకావాలని కోరారు.

ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి



చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న సీఐ రాంలాల్, ఎస్‌ఐ ఎండీ నవీద్

కృష్ణా: మండల సరిహద్దులోని చెక్‌పోస్టుల్లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని మక్తల్ సీఐ రాంలాల్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎస్‌ఐ ఎండీ నవీద్‌తో కలిసి సరిహద్దులోని చెక్‌పోస్టును సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ కర్ణాటక నుంచి అక్రమంగా రవాణా అవుతున్న మద్యం, గంజాయితో పాటు ఇతర నిషేధిత పదార్థాలు రాష్ట్రంలోకి రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రామన్‌పాడ్‌లో తగ్గిన నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడ్ జలాశయంలో శుక్రవారం సముద్రమట్టానికి పైన 1018 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ కాల్వ నుంచి 1,030 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుతుండగా.. సమాంతర కాల్వలో నీటి సరఫరా లేదన్నారు. ఇదిలా ఉండగా జలాశయం నుంచి ఎన్టీఆర్ కాల్వకు 875 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 55 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు వివరించారు.

స్నాతకోత్సవ సంబురం

నాలుగోసారి వేడుకలకు సిద్ధమవుతున్న పీయూ



- యూజీ, పీజీ, పీహెచ్‌డీ, ఫార్మ విభాగాల్లో 88 మందికి మెడల్స్
- ఇప్పటికే వివిధ సబ్జెక్టుల్లో పతకాలు అందిస్తున్న 16 మంది దాతలు
- ఆసక్తి గలవారి కోసం మరో అవకాశం
- రూ.2 లక్షలు ఎఫ్‌డీ చేస్తే.. వడ్డీతో మెడల్స్ ఇచ్చేందుకు చర్యలు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ నాలుగో స్నాతకోత్సవాన్ని ఈ నెల 16న నిర్వహించేందుకు పీయూ అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. 2021– 25 విద్యా సంవత్సరానికి సంబంధించి యూజీ, పీజీ, పీహెచ్‌డీ, ఫార్మ విభాగాల్లో 88 మందికి గోల్డ్ మెడల్స్ ప్రదానం కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్, చాన్స్‌లర్ జిష్ణుదేవ్ వర్మ హాజరుకానున్న నేపథ్యంలో స్నాతకోత్సవంపై ఉమ్మడి జిల్లా యూజీ, పీజీ విద్యార్థులకు ఆసక్తి నెలకొంది. మెడల్స్ ప్రదానోత్సవం, మెడల్స్ ఎంపిక విధానం, మెడల్స్ ఇచ్చే దాతలు ఎవరు, వీటికి నిధులు ఎక్కడి నుంచి వస్తాయి తదితర అంశాలపై స్నాతకోత్సవం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం..

మరో అవకాశం..

నేరుగా యూనివర్సిటీ మెడల్స్ అందిస్తున్న సబ్జెక్టులకు కూడా ఆసక్తి గలవారు స్పాన్సర్లుగా మారే అవకాశాన్ని పాలమూరు యూనివర్సిటీ కల్పిస్తుంది. స్నాతకోత్సవానికి మరో వారం రోజులు గడువు ఉండడంతో స్పాన్సర్స్‌గా ఆసక్తి ఉన్నవారు రావాలని అధికారులు సూచిస్తున్నారు. నేరుగా ఎగ్జామినేషన్ బ్రాంచిలో సీఓఈ ప్రవీణను కలిసి డిపాజిట్ మొత్తాన్ని అందిస్తూ, వారు సూచించిన పేరు మీద స్నాతకోత్సవంలో టాపర్స్‌కు మెడల్ అందించనున్నారు.

16 మంది దాతల సహకారం..

దాతలు మెడల్స్‌కు స్పాన్సర్‌గా మారాలంటే రూ.2 లక్షలు యూనివర్సిటీ ఖాతాలో ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో జమ చేయాల్సి ఉంటుంది. ప్రతి సంవత్సరం ఈ డబ్బులపై వచ్చే వడ్డీని మెడల్స్ ఇచ్చేందుకు అధికారులు వినియోగిస్తారు. ఎక్కువగా మెడల్స్‌లో మెమోరియల్ (స్మారకార్థం) ఇచ్చేవి ఉన్నాయి. కొంతమంది గౌరవార్థం, అభిమానంతో మరి కొన్ని మెడల్స్‌ను ఇస్తున్నారు. గతంలో వీసీగా పనిచేసిన ప్రొఫెసర్ భాగ్యనారాయణ ఆయన పీహెచ్‌డీ చదువుతున్న రోజుల్లో గైడ్ లెక్చరర్‌గా పనిచేసిన ప్రొఫెసర్ పి.రాంచర్ మెమోరియల్ మెడల్‌ను ఎమ్మెస్సీ బాటనీ విద్యార్థులకు అందించారు. గత నాలుగు స్నాతకోత్సవాల నుంచి మొత్తం 16 మంది దాతలు మెడల్స్ స్పాన్సర్ చేస్తున్నారు. 16 సబ్జెక్టులకు గాను 16 మంది స్పాన్సర్లు ఉన్నారు. ఇక సబ్జెక్టులకు నేరుగా యూనివర్సిటీ ద్వారా మెడల్స్ అందజేస్తున్నారు.

దాతలు వీరే..

- ప్రొఫెసర్ సీఆర్ ఆనంద్‌రావు మెమోరియల్ (ఫోకాల్) ఎంబీఎస్‌ఆర్ మెడల్, ఫోకాల్, మహబూబ్‌నగర్ బీకాం టాపర్
- కామరాజుగడ్డ రామచంద్రరావు మెమోరియల్ మెడల్, ప్రొఫెసర్ కేవీ చలపతి ఎంకాం టాపర్
- గుర్రం శ్యామల లక్ష్మీనర్సయ్య మెమోరియల్ మెడల్, జి.నాగయ్య, కరస్పాండెంట్, సిద్ధార్థ ప్రగతి ఇనిస్టిట్యూషన్స్ బీఈడీ టాపర్
- ప్రొఫెసర్ పి.రాంచర్ మెమోరియల్ మెడల్, ప్రొఫెసర్ భాగ్యనారాయణ, పీయూ మాజీ వీసీ ఎమ్మెస్సీ బాటనీ టాపర్
- నాగార్జున కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ మెడల్, నాగార్జున ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్, మహబూబ్‌నగర్ ఎంఈడీ టాపర్
- సరోజిని రాములమ్మ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ మెడల్, మేనేజ్‌మెంట్ ఆఫ్ సరోజిని రాములమ్మ కాలేజీ ఆఫ్ ఫార్మసీ, మహబూబ్‌నగర్ ఫార్మ్–డి టాపర్
- ఆంధ్రాబ్యాంక్, (యూనియన్ బ్యాంక్) మహబూబ్‌నగర్ మెడల్, ఆంధ్రాబ్యాంక్ (యూనియన్ బ్యాంక్) మహబూబ్‌నగర్, ఎంబీఏ టాపర్
- ఓబుగారి శ్రీనివాసయ్య మెడల్, ఓబుగారి శ్రీనివాసయ్య, రిటైర్డ్ అధ్యాపకులు, వీఎస్ డిగ్రీ కళాశాల, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ టాపర్
- ఆచార్య రుక్మొద్దీన్ మెమోరియల్ మెడల్, డాక్టర్ గాలీబ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆయుర్వేద, ఢిల్లీ, ఎంఏ తెలుగు టాపర్
- ఆదూరి కృష్ణమూర్తి మెమోరిల్ మెడల్, ఆదూరి ఆద్యశ్రీ మ్యాథ్స్ టాపర్
- హేమలత, మెమోరియల్ మెడల్, బి.విష్ణుజనార్దన్, విజయ నర్సింగ్ హోం, మహబూబ్‌నగర్ మైక్రోబయోలజీ టాపర్
- జోగినపల్లి సంతోష్, మాజీ ఎంపీ మెడల్, ఎస్‌వీడీసీ కళాశాల, మహబూబ్‌నగర్, ఎమ్మెస్సీ బాటనీ
- రాజనర్సయ్య మెమోరియల్ మెడల్, వాసవీ ప్రతాపరాజు, కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, జడ్చర్ల, టాపర్ బీపెడ్
- ఎన్‌కే రంగారావు, మెమోరియల్ మెడల్, ఎన్‌కే రాజేంద్రప్రసాద్‌రావు, కరస్పాండెంట్ ఠాగూర్ స్కూల్ షాద్‌నగర్, టాపర్ ఎంఏ పొలిటికల్ సైన్స్
- చెన్నకృష్ణగౌడ్ మెమోరియల్ మెడల్, జె.నారాయణగౌడ్, కరస్పాండెంట్, ఎస్‌వీఎం డిగ్రీ, పీజీ కళాశాల గద్వాల, టాపర్ ఎంఏ హిస్టరీ
- కామరాజుగడ్డ మెమోరియల్ మెడల్, కామరాజుగడ్డ ఫ్యామిలీ, టాపర్ బీబీఏ

దాతలు ముందుకు రావాలి..



స్నాతకోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆసక్తి గల దాతలు నేరుగా కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బ్రాంచిని సంప్రదించి సంబంధిత డిపాజిట్ మొత్తాన్ని చెల్లిస్తే వారు కోరుకున్న సబ్జెక్టులో కావాల్సిన వారి పేరు మీద మెడల్స్ అందించేందుకు ఆస్కారం ఉంది. ఇప్పటికే 16 మంది స్పాన్సర్లు మెడల్స్ అందిస్తున్నారు.

– ప్రవీణ, పీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్

ఏర్పాట్లు పూర్తిచేశాం..



ఈ నెల 16న జరిగే స్నాతకోత్సవ వేడుకను అట్టహాసంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. అన్ని విభాగాలల్లో 88 మందికి మెడల్స్ అందిచనున్నాం. మెడల్స్‌కు 16 మంది స్పాన్సర్స్ వచ్చారు. ఇంకా ఆసక్తి ఉన్న వారు నేరుగా ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో సంప్రదించి వారికి కావాల్సిన వారి పేరు మీద మెడల్స్ అందించవచ్చు.

– జీఎస్ శ్రీనివాస్, వీసీ, పీయూ

క్రీడలకు ప్రాధాన్యం


నిర్మల్-మెదక్ బాలికల మ్యాచ్


నల్లగొండ-కొత్తగూడెం బాలికల జట్ల మ్యాచ్

- ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం చైర్మన్ ఎన్పీ వెంకటేశ్
- పాలమూరులో ప్రారంభమైన రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలు
- పాల్గొన్న 28 జిల్లాల జట్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: తెలంగాణ రాష్ట్రంలో క్రీడలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం చైర్మన్ ఎన్పీ వెంకటేశ్ అన్నారు. పాలమూరులోని ప్రధాన స్టేడియంలో శుక్రవారం రాష్ట్రస్థాయి జూనియర్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 7వ ట్రెడిషనల్, 3వ ఫాస్ట్-5, 1వ మిక్స్‌డ్ విభాగాల టోర్నమెంట్లు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని 28 జిల్లాల బాల, బాలికల జట్లు పాల్గొంటున్నాయి. ఈ నెల 12 వరకు టోర్నమెంట్ జరగనుంది. టోర్నీ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎన్పీ వెంకటేష్ హాజరై మాట్లాడారు. క్రీడలను ప్రోత్సహించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. టోర్నీలో 28 జిల్లాల జట్లు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని.. ఓడినవారు నిరాశ చెందకుండా గెలుపునకు శ్రమించాలని సూచించారు. క్రీడా పోటీలకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధానకార్యదర్శి కురుమూర్తిగౌడ్ మాట్లాడుతూ.. క్రీడాకారులకు క్రమశిక్షణ చాలా అవసరమని, కోచ్‌లు చెప్పే సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడు బి.విక్రం ఆదిత్యారెడ్డి మాట్లాడుతూ.. క్రీడాకారులు పట్టుదలతో ఆడి జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదగాలని కోరారు. రాష్ట్రానికి చెందిన ఇద్దరు బాలికలు అంతర్జాతీయ టోర్నీల్లో ఆడటం సంతోషంగా ఉందని.. ఇదే స్ఫూర్తితో మరింత మంది క్రీడాకారులు తమ ప్రతిభ చాటాలని సూచించారు. అనంతరం అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్న యశశ్రీ, లితిషను ఘనంగా సన్మానించారు. అంతకుముందు ఆయా జిల్లాల జట్లు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించగా అతిథులు గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో నెట్‌బాల్ అసోసియేషన్ తెలంగాణ అధ్యక్ష, కార్యదర్శులు విక్రం ఆదిత్యారెడ్డి, శిరీషరాణి, ఖాజాఖాన్, రాజారాం, రామ్మోహన్‌గౌడ్, అంజద్‌అలీ, అక్రమ్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.


గౌరవ వందనం స్వీకరిస్తున్న ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్


టోర్నీలో పాల్గొన్న వివిధ జిల్లాల క్రీడా జట్లు

'పాలమూరు' శుభారంభం..

ట్రెడిషనల్ విభాగంలో పాలమూరు బాల, బాలికల జట్లు శుభారంభం చేశాయి. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో జరిగిన పోటీల్లో బాలుర విభాగంలో జిల్లా జట్టు 15-9 పాయింట్ల తేడాతో సిరిసిల్లపై, మరో మ్యాచ్‌లో 16-1 తేడాతో పెద్దపల్లి జట్టుపై విజయం సాధించాయి. బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు 5-1 పాయింట్ల తేడాతో సిరిసిల్ల జట్టుపై గెలుపొందింది. బాలుర విభాగంలో మహబూబాబాద్ జట్టు 15-7 తేడాతో నిజామాబాద్‌పై, ఖమ్మం జట్టు 16-5 తేడాతో ఆసిఫాబాద్‌పై, నల్లగొండ జట్టు 14-1 తేడాతో ఆదిలాబాద్‌పై, వనపర్తి జట్టు 7-1 తేడాతో వరంగల్‌పై, మెదక్ జట్టు 8-2 తేడాతో నిర్మల్‌పై గెలిచాయి. బాలికల విభాగంలో మేడ్చల్ జట్టు 14-2 పాయింట్ల తేడాతో ఆదిలాబాద్‌పై, నల్లగొండ జట్టు 12-4 తేడాతో వరంగల్‌పై, హైదరాబాద్ జట్టు 4-2 తేడాతో మెదక్‌పై, కామారెడ్డి జట్టు 4-1 తేడాతో నారాయణపేటపై, కరీంనగర్ జట్టు 6-2 తేడాతో జనగాంపై, మేడ్చల్ జట్టు 6-1 తేడాతో పెద్దపల్లిపై, ఖమ్మం జట్టు 14-2 తేడాతో మహబూబాబాద్‌పై, నాగర్‌కర్నూల్ జట్టు 6-3 తేడాతో ఖమ్మంపై, నిజామాబాద్ జట్టు 8-5 తేడాతో కరీంనగర్‌పై, జగిత్యాల జట్టు 6-1 తేడాతో మంచిర్యాలపై, ఆసిఫాబాద్ జట్టు 10-9 తేడాతో గద్వాల జట్టుపై గెలుపొందాయి.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


పెద్దయ్య (ఫైల్)

గద్వాల క్రైం: ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. దౌదర్‌పల్లి కాలనీకి చెందిన పెద్దయ్య(39) జీవనోపాధి నిమిత్తం గ్యాస్ పొయ్యిలకు మరమ్మతు చేస్తుంటాడు. ఈ శుక్రవారం ఉదయం జిల్లా కేంద్రంలోని గద్వాల ఔటర్ రింగ్ రోడ్డుపై బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో పెద్దయ్య వ్యక్తి తీవ్రంగా గాయపడి మృతి చెందాడు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


బొసింగ్ (ఫైల్)

గోపాల్‌పేట: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన రేవల్లి మండలంలోని కేశంపేట పాతతండాలో శుక్రవారం చోటుచేసుకుంది. రేవల్లి హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపిన వివరాలిలా.. కేశంపేట పాతతండాకు చెందిన నున్సావత్ బొసింగ్(35), చిట్టి భార్యభర్తలు. వీరు నాలుగేళ్లుగా పిల్లలతో కలిసి హైదరాబాద్‌లోనే ఉంటూ కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తూ వచ్చారు. గురువారం బొసింగ్ దంపతులు ఇద్దరూ గ్రామానికి వచ్చారు. ఏమైందో తెలియదు.. శుక్రవారం ఉదయం చూసేసరికి బొసింగ్ తన ఇంట్లోనే ఉరేసుకొని కనిపించాడు. గ్రామస్తులు విషయాన్ని పోలీసులకు సమాచారం అందించగా.. వారు అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. బొసింగ్ అమ్మ తులసి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తామని హెడ్‌కానిస్టేబుల్ వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవాబుపేట: క్షణికావేశంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మండలంలోని జంగమయ్యపల్లికి చెందిన కమ్మరి ఆచారి(46) ఈనెల 4వ తేదీన మద్యం తాగి ఇంటికి చేరుకున్నాడు. దీంతో అతడి భార్య భారతమ్మ నిత్యం తాగి వస్తావా అంటూ భర్తతో గొడవ పెట్టుకుంది. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో క్షణికావేశంలో ఇంటి మేడపై ఉన్న కలుపు మందును తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. వారం రోజులపాటు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ విషయంలో మృతుడి కుమారుడు కమ్మరి పవన్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


మృతురాలు పద్మమ్మ

మద్దూరు: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని దోరేపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. దోరేపల్లి గ్రామానికి చెందిన బుడగ జంగం శేఖర్‌తో కొన్నేళ్ల క్రితం పద్మమ్మ(35)కు వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం పద్మమ్మ తన ఇద్దరు కొడుకులు చదువుతున్న దోరేపల్లి పాఠశాలకు భోజన సమయంలో వెళ్లి వారికి తినిపించింది. కుమారులు అడిగిన తినుబండారాలను కొనిచ్చి తనతో రావాలని కోరింది. కానీ పాఠశాల వేళల్లో విద్యార్థులను పంపమని ఉపాధ్యాయులు చెప్పడంతో ఆమె అక్కడి నుంచి వెళ్లింది. అప్పటి నుంచి గ్రామంలో కనిపించలేదన్నారు. శుక్రవారం పాఠశాల సమీపంలో ఉన్న ఊర చెరువులో ఓ శవం బయట పడటంతో గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు వెళ్లి చూశారు. ఎవరూ గుర్తుపట్టకపోవడంతో నిన్నటి నుంచి కనిపించకుండా పోయిన మహిళ భర్త శేఖర్‌ను పిలిపించారు. అతను అక్కడికి వెళ్లి చూడగా.. తన భార్య పద్మనే అని గుర్తించాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించగా.. శవాన్ని మహబూబ్‌నగర్ ప్రధాన ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు తెలిసింది.

యువత నైపుణ్యం పెంచుకోవాలి


మెగా జాబ్‌మేళాకు వచ్చిన వివిధ కంపెనీల ప్రతినిధులు, ఎంపికైన అభ్యర్థులతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మారుతున్న కాలానికి అనుగుణంగా యువత నైపుణం పెంచుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని శిల్పారామంలో నిర్మాణ్ ఓఆర్‌జీ, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు నైపుణ్యంతో పాటు నాణ్యతను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక సాంకేతిక కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉపాధి అవకాశాలు దక్కాలంటే ఆధునిక సాంకేతికతతో పాటు సరైన పరిజ్ఞానం ఎంతో అవసరమన్నారు. దీని కోసం స్థానికంగా టాస్క్, అమరరాజా, సెట్విన్ సంస్థల స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ మేళాకు సుమారు 20 కంపెనీల ప్రతినిధులు హాజరై.. అక్కడికి వచ్చిన సుమారు 270 మంది అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం వివిధ దశల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి 120 మందిని ఎంపిక చేశారు. వీరికి ఉద్యోగ స్థాయిని బట్టి కనీస నెల వేతనం రూ. పది వేల నుంచి రూ.25 వేల వరకు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

బురిడీ కొట్టించబోయి.. బుక్కయ్యాడు

- ప్రజల్లో తన మంత్రాల విశ్వసనీయత పెంచాలని చోరీకి పాల్పడిన వైనం
- గుట్టురట్టు చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ గిరిధర్

వనపర్తి: తన మంత్రాలతో పోయిన వస్తువులను తిరిగి తెప్పిస్తానని, తాయత్తులతో సమస్యలు పరిష్కరిస్తానంటూ ప్రజలను నమ్మించే ప్రయత్నంలో ఓ బాబా వేసిన ప్లాన్ బెడిసి కొట్టింది. ఓ పీర్ల చావిడిలో ఉన్న వెండి, రాగి వస్తువులను తన సహాయకులతో చోరీ చేయించి.. తన మంత్రాలతో అవి ఎక్కడ ఉన్నాయో చెప్పి ప్రజల్లో తనపై, తన మంత్రాలపై విశ్వాసం పెంచుకునేందుకు పథకం రచించాడు. కానీ, పోలీసులు రంగప్రవేశం చేసి సదరు బాబాతోపాటు ఆయనకు సహకరించిన అందరినీ అరెస్టు చేశారు. వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం బెక్కెంలో ఈ ఘటన చోటుచేసుకోగా.. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం ఎస్పీ రావుల గిరిధర్.. డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కృష్ణయ్యతో కలిసి విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. వృత్తిరీత్యా ఆర్‌ఎంపీగా జీవనం సాగిస్తున్న షామీర్ పాషా సులభమైన సంపాదన మార్గాన్ని ఎంచుకుని ప్రజల్లోని మూఢనమ్మకాలను ఆసరా చేసుకుని మంత్రాలు చేస్తాను, తాయత్తులు కడతానంటూ ప్రతి అమావాస్య నాడు చిన్నంబావి మండలం బెక్కెం గ్రామంలోని ప్రజలను మోసం చేస్తూ సొమ్ముచేసుకుంటూ ఉండేవాడు.

నమ్మకం పెంచాలని మాస్టర్ ప్లాన్..

అయితే, ప్రజల్లో తనపట్ల, తన మంత్రాల పట్ల విశ్వాసం పెంచుకునేందుకు ఓ పథకం రచించాడు. ఈమేరకు బెక్కెం గ్రామంలోని పీర్లచావిడిలోని వెండి, ఇత్తడి వస్తువులను గత నెల 21వ తేదీన తన సహాయకుల చేత చోరీ చేయించి అడ్డాకుల మండలంలోని కందూరు గ్రామంలో దాచిపెట్టారు. కానీ, ఈ చోరీ ఘటనను ఎవరూ గుర్తించకపోవడంతో విషయం వెలుగులోకి రాలేదు. దీంతో ఈ నెల 7వ తేదీ తెల్లవారుజామున మరోసారి పీర్లచావిడిలోని వస్తువులను చిందర వందర చేసి చోరీ ఘటనను గ్రామస్తులు గుర్తించేలా చేశారు. అంతటితో ఆగక.. షామీర్ పాషానే స్వయంగా పీర్లచావిడిలో చోరీ జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ కృష్ణయ్య నేతృత్వంలో దర్యాప్తు చేపట్టిన పోలీసు బృందం తమదైన శైలిలో విచారణ చేయగా.. ఫిర్యాదు చేసిన వ్యక్తే చోరీకు ప్లాన్ చేసినట్లు గుర్తించి శుక్రవారం ఆయనతో పాటు చోరీకి సహకరించిన మరో ముగ్గురిని అదుపులోకి తీసుకోవటంతో పాటు వారి వద్ద నుంచి 9.310 కిలోల వెండి, 13.680 కిలోల ఇత్తడి వస్తువులతో పాటు ఓ కారు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన వస్తువులను ఓ రహస్య ప్రాంతంలో ఉంచి తానే.. తన మంత్రశక్తితో వస్తువులు ఫలానాచోట ఉన్నాయని చెప్పి గ్రామస్తులను పంపించి వాటిని తిరిగి పీర్లచావిడికి తెప్పించి తన మంత్రాలకు శక్తి చాలా ఉందనే భ్రమ ప్రజలకు కల్పించాలి అని ఈ చోరీకి ప్లానింగ్ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. ప్రజలు ఇలాంటి బురిడీ బాబాలను నమ్మి మోసపోవద్దని ఆయన సూచించారు. బెక్కెం గ్రామానికి చెందిన నిందితులు షామీర్ పాషా, మందాడి శివకృష్ణ, వనమల మురళీధర్, అనుకలి మహేష్‌ను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసును ఛేదించిన పోలీసు బృందాన్ని ఎస్పీ అభినందించి క్యాష్ రివార్డ్ అందజేశారు.


కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్, డీఎస్పీ, సీఐ తదితరులు

జూరాలకు స్వల్పంగా తగ్గిన ఇన్‌ఫ్లో

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో క్రమక్రమంగా తగ్గుతోంది. గురువారం రాత్రి 9 గంటల వరకు ప్రాజెక్టుకు 84,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శుక్రవారం రాత్రి 8 గంటల వరకు 79 వేల క్యూసెక్కులకు తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని అన్ని ఎత్తిపోతల పథకాలకు నీటిని నిలిపివేశారు. దీంతో ప్రాజెక్టు 2 క్రస్టు గేట్లను ఎత్తి 14,330 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే విద్యుదుత్పత్తి నిమిత్తం 45,481 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 70 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 600 క్యూసెక్కులు కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 61,511 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 9.275 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో 12 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 6 యూనిట్ల ద్వారా 403.165 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వారా 390.084 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 793.249 ఎంయూ విజయవంతంగా విద్యుదుత్పత్తి చేపట్టారు.

శ్రీశైలంలో 884.8 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: జూరాల ఆనకట్ట స్పిల్‌వే ద్వారా 14,330, విద్యుదుత్పత్తి చేస్తూ 45,481, సుంకేసుల నుంచి 2,280, హంద్రీ ద్వారా 250 మొత్తం కలిపి 62,341 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయానికి చేరుతోంది. శ్రీశైలంలో భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 27,220 మొత్తం కలిపి 62,535 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయంలో 884.8 అడుగుల వద్ద 215.3263 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

బాదేపల్లి పాఠశాలలో డీఈఓ విచారణ



జడ్చర్ల టౌన్: బాదేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనంలో జెర్రి కనిపించిన ఘటనపై శుక్రవారం జిల్లా విద్యాధికారి ప్రవీణ్‌కుమార్ విచారణ జరిపారు. పాఠశాలకు చేరుకున్న ఆయన విద్యార్థులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్‌ఎఫ్‌ఐ, ఏబీవీపీ నాయకులు వేర్వేరుగా డీఈఓను కలిసి వంట ఇక్కడే చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ ప్రశాంత్, ఏబీవీపీ కన్వీనర్ సౌమ్య ఉన్నారు.

14న ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా ఆర్చరీ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని డీఎస్‌ఏ స్టేడియంలో ఈనెల 14వ తేదీన ఉమ్మడి జిల్లా అండర్-14, అండర్-17, అండర్-19 బాలబాలికల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్చరీ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ శారదాబాయి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు ఒరిజినల్ బోనఫైడ్, ఆధార్‌కార్డు, అండర్-19 విభాగం వారు పదోతరగతి మెమో, బోనఫైడ్, ఆధార్ కార్డు జిరాక్స్‌తో కోచ్ జ్ఞానేశ్వర్‌కు రిపోర్టు చేయాలని కోరారు. అలాగే అదే రోజు డీఎస్‌ఏ స్టేడియంలో జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల చెస్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నదిలో దూకి వివాహిత ఆత్మహత్యాయత్నం

ఎర్రవల్లి: కృష్ణానదిలో దూకి ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్‌ఐ రవినాయక్ కథనం మేరకు వివరాలిలా.. హైదరాబాద్‌లోని జీడిమెట్ల సురారం కాలనీకి చెందిన జయశ్రీ కుటుంబ కలహాల కారణంగా మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకునేందుకు శుక్రవారం బీచుపల్లికు చేరుకుంది. అనంతరం కృష్ణానది వంతెనపై నుంచి నదిలోకి దూకింది. దీనిని గమనించిన స్థానికులు కొండపేటకు చెందిన మత్స్యకారులకు సమాచారం ఇవ్వగా.. అక్కడే ఉన్న వారు వెంటనే పుట్టీల సహాయంతో నదిలో కొట్టుకుపోతున్న జయశ్రీని కాపాడి ఒడ్డుకు చేర్చి ప్రథమ చికిత్స అందజేశారు. అనంతరం స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆమె కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకొని వారిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం వారికి మహిళను అప్పగించారు. మహిళ ప్రాణాలు కాపాడిన మత్స్యకారులను పోలీసులతో పాటు పలువురు అభినందించారు.

పీయూకు బంగారు పతకం అందించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు యోగా పోటీల్లో తమ నైపుణ్యాలను పూర్తిస్థాయిలో వినియోగించుకొని పీయూకు బంగారు పతకం అందించాలని వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేష్‌బాబు అన్నారు. పీయూలో ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ, సౌత్ జోన్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో ఎంపికైన విద్యార్థులను వీసీ, రిజిస్ట్రార్ అభినందించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు బెంగళూరులోని సవస్య యూనివర్సిటీలో జరిగే పోటీల్లో పాల్గొనున్నట్లు పీడీ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యోగా క్రీడా అసోసియేషన్ అధ్యక్షుడు బాలరజాయ్య, సెక్రటరీ రజిని తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తాం'

జడ్చర్ల టౌన్: చట్టబద్ధతతో కూడిన 42శాతం రిజర్వేషన్లు సాధించేందుకు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ వెల్లడించారు. శుక్రవారం జడ్చర్ల ఎమ్మార్పీఎస్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బీసీ ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు 34 స్థానాలు కేటాయిస్తామని మోసం చేశారని, ఇప్పుడు అదే తరహాలో 42శాతం రిజర్వేషన్లు అంటూ అమలు చేసే ఉద్దేశం లేకుండా పోయిందన్నారు. కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురాలేకపోయిందని ఆరోపించారు. చట్టబద్ధత కల్పించేందుకు త్వరలోనే ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సమావేశంలో రజకసంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు నర్సింహులు, విజయ్‌కుమార్, శ్రీనివాస్, గోపాల్, శివశంకర్ పాల్గొన్నారు.

బీసీలు ఇకనైనా మేల్కొనాలి

రాష్ట్రం ప్రభుత్వం బీసీలను మరోసారి మోసం చేస్తుందని, అందుకే ఇకనైనా మేల్కొనాలని బీజేపీ అధికార ప్రతినిధి ఎద్ల బాలవర్ధన్‌గౌడ్ ప్రకటనలో పిలుపునిచ్చారు. 42శాతం రిజర్వేషన్లంటూ మభ్యపెడుతున్నారని గుర్తించాలన్నారు. హైకోర్టు, సుప్రీం కోర్టులో పిటీషన్లు వేసినవారు ఎవరో గుర్తించాలని, ఈ విషయంలో కాంగ్రెస్ ఏం సమాధానం ఇస్తుందని ప్రశ్నించారు.

రూ.10వేలతో మొదలై రూ.450కోట్ల టర్నోవర్

- శ్రీరామ జయరామ సంస్థల అధినేత బెక్కరి రాంరెడ్డి
- ఘనంగా శ్రీరామ జయరామ 51వ వ్యవస్థాపక దినోత్సవం

పాలమూరు: 1974లో రూ.10వేల పెట్టుబడితో మొదలైన శ్రీరామ జయరామ సంస్థ దినదినాభివృద్ధి చెందుతూ ప్రస్తుతం రూ.450కోట్ల వార్షిక టర్నోవర్‌కు చేరిందని సంస్థ అధినేత బెక్కరి రాంరెడ్డి అన్నారు. శ్రీరామ జయరామ 51వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో వైభవంగా నిర్వహించారు. ఈ సంస్థల ద్వారా 1200మంది ఉద్యోగులతో కలిసి రైతులకు సేవలు అందిస్తున్నామని, 1984లో మహీంద్ర ట్రాక్టర్ డీలర్ షిప్ తీసుకుని ఇప్పటివరకు 40వేల ట్రాక్టర్లు విక్రయించామన్నారు. ఇదే ఏడాది టీవీఎస్ ద్విచక్ర వాహనాల డీలర్ షిప్ తీసుకుని 20వేల వాహనాలు విక్రయించినట్లు వెల్లడించారు. 2012లో మారుతీ కార్ల డీలర్ షిప్ తీసుకొని ఇప్పటివరకు 20వేలకు పైగా కార్లు విక్రయాలు చేశామన్నారు. సమాజానికి సేవ చేయాలనే ఆలోచనతో ఆస్పత్రి ద్వారా 3వేల మంది రోగులకు ఉచితంగా చికిత్స అందించినట్లు తెలిపారు. అనంతరం 50 ఏళ్ల యాత్రలో సహకరించిన అందరినీ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్ బెక్కరి జయలక్ష్మి, మహీంద్ర జోనల్ సేల్స్‌హెడ్ ఇంద్రకంటి అరవింద్, ఏరియా సీనియర్ మేనేజర్ శెట్టి ఉదయ్, డిప్యూటీ మేనేజర్ యాసిఫ్, సంస్థ సీఈవోలు సరసయ్య, విక్రమ్‌యాదవ్, నాగేంద్ర, మారుతీ షోరూం జీఎం వేణుగోపాల్‌రెడ్డి, రామకృష్ణ, తుకారం, రామదాసు, శ్రీనివాస్‌గౌడ్, నవీన్‌తో 1200మంది ఉద్యోగులు పాల్గొన్నారు.


40 వేల మహీంద్ర ట్రాక్టర్‌ను రవి అనే రైతుకు అందజేస్తున్న బెక్కరి రాంరెడ్డి

పరిహారం ఇస్తారా.. చావమంటరా?

- సత్యసాయి పంప్‌హౌజ్ ఎదుట బాధితుల నిరసన
- భారత్‌మాల పరిహారం మాకే ఇవ్వాలంటూ డిమాండ్

కృష్ణా: సత్యసాయి పంప్‌హౌజ్ ఎదుట శుక్రవారం ఓ నిరుపేద కుటుంబ సభ్యులు పురుగుమందు డబ్బాతో నిరసన వ్యక్తం చేసిన ఘటన చోటుచేసుకుంది. తమకు పరిహారం ఇస్తారా? చావమంటరా? అంటూ హెచ్చరించారు. బాధితుల కథనం ప్రకారం.. గుడేబల్లూర్‌కు చెందిన బుద్ధమోళ్ల మహేశ్ కుటుంబానికి చెందిన 7గుంటల భూమిని 25ఏళ్ల కిందట సత్యసాయి తాగునీటి పంపుహౌజ్ నిర్మాణానికి ఇచ్చారు. అప్పట్లో సంస్థలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారని.. తీరా ఉద్యోగం కల్పించలేదు, ఎలాంటి పరిహారం ఇవ్వలేదని ఆరోపించారు. మా నాన్న కార్యలయాలకు తిరిగితిరిగి మృతిచెందాడని, ఇప్పుడు కూడా పలుమార్లు సత్యసాయి కార్యాలయాలు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రస్తుతం భారత్‌మాల రోడ్డు నిర్మాణం ఈ భూమి నుంచి (సత్యసాయి నీటిపంపు) వెళ్తుంది. ఆ పరిహారం డబ్బులు బాధిత కుటుంబానికి రావడంలేదు. దీంతో ఆ పరిహారం డబ్బులు మా కుటుంబానికి అందించాలని, ఈ విషయంపై పలుమార్లు మండల, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సహనం నశించి పంపుహౌజ్ ఎదుట పురుగుల మందుతో బైఠాయించారు. పరిహారం అందిస్తారా లేక ఆత్మహత్య చేసుకోవాల అంటూ హెచ్చరించారు. విషయం తెలుసుకున్న సత్యసాయి నీటిసరఫరా అధికారులు, ఎస్‌ఐ ఎండీ నవీద్ అక్కడికి చేరుకొని తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో దీక్షను విరమించారు. వారం రోజుల్లో తమకు న్యాయం జరగకపోతే మళ్లీ బైఠాయిస్తామని పేర్కొన్నారు.


పురుగు మందుతో సత్యసాయి పంప్‌హౌజ్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

బంగారు షాపులో చోరీకి యత్నం

మక్తల్: పట్టణంలో బంగారు షాపులు, తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా చేసుకొని దొంగలు రెచ్చిపోతున్నారు. వారం రోజుల వ్యవధిలో నాలుగు చోట్ల దొంగతనాలు జరగడంతో పట్టణ ప్రజలు భయాందోళనలో ఉన్నారు. గురువారం రాత్రి పోలీస్ స్టేషన్ సమీపంలోని బొడ్రాయి ఎదురుగా ఉన్న విష్ణు జ్యువెలర్స్‌లో దొంగతనానికి విఫలయత్నం చేశారు. పూర్తి వివరాలు.. స్థానిక విష్ణు బంగారు దుకాణం ముందు భాగాన ఉన్న స్వెటర్ తాళాలు విరగొట్టినా ఎంతకు తెరచుకోకపోవడంతో దుకాణం వెనుక భాగాన ఉన్న గోడకు రంధ్రం వేసేందుకు ప్రయత్నించారు. దొంగతనానికి అనుకూలంగా లేకపోవడంతో దొంగతనాన్ని విరమించుకున్నారు. దుకాణ యజమాని ముకేశ్ శుక్రవారం ఉదయం దుకాణం తెరిచేందుకు ప్రయత్నించగా తాళాలు విరగ్గొట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఈ క్రమంలో బస్టాండ్‌లో పలువురిని అదుపులోకి తీసుకోని వేలి ముద్రలు తీసుకున్నారు.

